కథ

# మళ్లీ రెక్కలొచ్చిన పక్షులు

దుద్దుంపూడి అనసూయ
96182 72630

'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో రూ.3 వేల బహుమతి పొందిన కథ.

సైదులు నిద్రలోంచి ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. మంచం పక్కన చెంబులోని మంచినీళ్లు గటగటా తాగేసి, మళ్లీ నిద్రకు ఉపక్రమించాడు. కానీ, ఎంతసేపటికీ నిద్రాదేవి కరుణించలేదు. రాత్రి తాగిన మత్తు పూర్తిగా వదిలిపోయినట్టుంది. లేచి లైటు వేసుకుని అటూ ఇటూ పచార్లు చేశాడు. ఇంక లాభం లేదనుకుని.. గోడ గూట్లో ఉన్న లిక్కర్ సీసా తీసి, అటూ ఇటూ ఊపి చూశాడు. అడుగున ఏకాస్తయినా మిగిలుందేమో.. తాగేస్తే మళ్లీ నిద్ర పోవచ్చని. ఆశ ఫలించలేదు. ఉస్సూరంటూ మళ్లీ మంచం మీద కూర్చుని గోడకేసి చూశాడు. గోడకు తగిలించిన ఫొటోలో ఉన్న ఏడాది పాపను చూసేసరికి.. దుఖం ఆపుకోలేక పోయాడు సైదులు. అతనికి తెలియకుండానే బిగ్గరగా ఏడ్చేశాడు. అది విని.. పక్క పోర్షన్‌లో నిద్రపోతున్న సావిత్రి, ఆమె మనవరాలు వయసున్న అమ్ములు గబుక్కున లేచి కూర్చున్నారు.

''ఈ తాగుబోతు సచ్చినోడు.. ఆడు నిద్దరోడు. మనల్నెవ్వర్నీ నిద్రోనీడు'' అంటూ గొణుగుతూ.. సావిత్రమ్మ పరుగెట్టుకొస్తే, వెంట అమ్ములు వచ్చి సైదులు వంక జాలిగా చూసింది.

''ఒరే.. సైదులు! రెండేళ్లయింది. ఇంక మరిచిపోనాకి పయత్నించవేటి!? మాకు మాత్రం బాధ లేదా ఏటి!? అలగని.. ఇలగ పూటుగ తాగేసి అర్ధరేతిరి అందరికి నిద్ర పోగొడుతున్నామా!? ఆ మాయదారి రోగం వచ్చినప్పుడు నీకులాగనే మేంకూడ నట్టపోయాం కదేటి!? నాకేమో శుక్లాలొచ్చి సరిగ సూపానటం నేదు. ఎవరేటి చేత్తాం.. పోయినోల్లని మరిచి పోనేకపోతే.. ఉన్నోల్లమి ఎలగుంటం''.. మందలిస్తూనే సైదుల్ని ఓదార్చింది.

పోర్షన్‌లోకి వెళ్లి, నిద్ర పోవడానికి ప్రయత్నించారు సావిత్రి, అమ్ములు.

రెండేళ్ల క్రితం జరిగిన సంఘటనలన్నీ సినిమా రీలులా కళ్ల ముందుకొస్తుంటే.. సావిత్రికి, అమ్ములుకు కూడా నిద్రాదేవి దూరంగా వెళ్లిపోయింది.

* * *

రెండేళ్ల క్రితం నెల్లిపాక బంజరు నుంచి హైదరాబాదుకు వలస వచ్చింది మంగవేణి. కూతురు అమ్ములు చిన్న పిల్లయినా.. ఉన్న ఊళ్లో 'నా' అనే వాళ్లులేని మంగవేణి, కూతుర్ని చదువు మానిపించి తనతోపాటు తీసుకొచ్చింది. ఆమె పనిచేసే అపార్ట్‌మెంట్ల నిర్మాణ పనికోసమే.. సావిత్రి, ఆమె భర్త ఓబులేసు అనకాపల్లి నుంచి, సైదులు మాడుగుల నుంచి వలస వచ్చారు.

ఉన్నచోట సరిగా పనులు లేవు. ఉన్నా సరిపడా డబ్బులు రావడం లేదు. దాంతో దూరంగా ఉన్నా.. సిటీలో అపార్ట్‌మెంట్లు ఎక్కువ కడుతున్నారని, కూలీ ఎక్కువ ఇస్తున్నారని చాలా ఊళ్లనుంచి ఎన్నో కుటుంబాలు మూటాముల్లే సర్దుకుని హైదరాబాదుకు వలస వచ్చాయి.

కొన్ని రోజులు బాగానే సాగింది. అందరూ డేరాలు కట్టుకుని, కాస్త వండుకుని తింటూ పనిచేస్తూ కాలం గడిపేవాళ్లు. అందరి ఆశ ఒకటే.. ఊరు కాని ఊరొచ్చినందుకు వెళ్లేటప్పటికి కొంత డబ్బు మిగుల్చుకుని వెళ్లాలని.

ఒకరోజు దురదృష్టకరమైన సంఘటన జరిగింది. సైదులుకు తీరని నష్టం జరిగింది. అతని కూతురు కనిపించకుండా పోయింది. సైదులుకు పెళ్లయిన పదేళ్లకు సంతానం కలిగింది. అన్నేళ్లకు పుట్టిన కూతురంటే సైదులుకు ప్రాణం. అందుకే.. తనతోపాటు భార్యనూ, కూతుర్నీ పని చేసే చోటుకు తీసుకొచ్చాడు. అప్పటికి పాప వయసు రెండేళ్లు. సైదులు, అతనికి హితులుగా మారిన మంగవేణి, సావిత్రి, ఆమె భర్త ఓబులేసు చుట్టుపక్కల మొత్తం రెండు రోజులపాటు వెతికారు. పిల్లతల్లి పిచ్చి పట్టినట్టు ఏడుస్తూనే ఉంది.

మిగతా పనివాళ్లు అక్కడే ఉన్న కంకర దిబ్బలోంచి కంకర ఎత్తి పోస్తుంటే.. దుర్వాసన వస్తున్నదని పరిశీలించి చూశారు. పాప శవం.. రాళ్ల బరువుకు నుజ్జునుజ్జు అయిపోయి ఉంది. సైదులు, అతని భార్య గుండెలవిసి పోయేలా ఏడ్చారు.

విషయం అందరికీ అర్థమయింది. పాప కనిపించకుండా పోయిన రోజే.. గోడ పక్కన ఆడుకుంటూ, అలసి అక్కడే నిద్రపోయి ఉంటుంది. ఈలోపు లారీవోళ్లు చూసుకోకుండానే కంకర దిమ్మరపోసి వెళ్లిపోయి ఉంటారు. ఏ లారీ డ్రైవరన్నది గుర్తుపట్టడం కూడా కష్టమే! రోజురోజుకు మారుతూ ఉంటారు. యజమాని నష్టపరిహారం అంటూ కొంత డబ్బివ్వబోయాడు. కానీ, సైదులు తీసుకోలేదు. అందరూ సైదులుపై జాలిపడటం తప్ప ఏమీ చెయ్యలేక.. ఎవరి పనుల్లో వాళ్లు మునిగిపోయారు. సైదులు ఇంక అక్కడ ఉండలేక ఊరెళ్లి పోవడానికి బయల్దేరితే.. రమణ రానని చెప్పింది.



''బాగ రేతిరైపోనాది తొంగో! మేం కూడ నిద్రోతేనే గంద తెల్లారి పనికెల్లేది. లేకుంటే కూడెలగొత్తాది? నువ్వంటే కొంప అమ్మేస్కుని ఆ డబ్బుల్తో సారా కొనుక్కుని తాగేసి తొంగుంటున్నావు. అలగని తిండీతిప్పలు నేకుండ తాగేత్తుంటే సచ్చిపోతావు. జాలిపడి కంచంలో కూడెట్టిత్తే తినవు. తెల్లారి అది కుక్కల పాలె గదేటి!? ఏనాటికి కోలుకుంటావో తెలిట్నేదు''.. అంటూ వాళ్ల

పాప చనిపోయిన రాళ్ల గుట్ట దగ్గర కూర్చుని..

''నా బుజ్జి ఇక్కడే ఉంది. ఎతుక్కోవాలి. నేను రాను'' అంటూ మొరాయించింది.

''నీ మూలంగనే కదేటి ఇలగయింది. నువ్వు నా కూతుర్ని కనిపెట్టుకునుంటే.. నాకూతురు నాకు దూరమయి ఉండేదా!? నువ్వే నా కూతుర్ని చంపేసినావు'' అంటూ సైదులు కోపంతో ఊగిపోతూ,